
సాక్షి ఖమ్మం

గురువారం । 18 । జూలై । 2024



నోనో.. కోనోకార్పస్

పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా పరిణమించిన కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని పలువురు కోరుతున్నారు. 8లో



షరతులు లేకుండా మాఫీ..

రైతుల రుణాలను షరతులు లేకుండా మాఫీ చేయాలని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
27° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతల ప్రభావం అంతగా ఉండదు. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.



ఏకాదశి.. మొహర్రం

హిందువులు పవిత్రంగా భావించే తొలి ఏకాదశి.. ముస్లింలు త్యాగానికి ప్రతిరూపంగా జరుపుకునే మొహర్రం పర్వదినాలు ఒకేరోజు వచ్చాయి. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచే హిందువులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు భక్తులు బారులుదీరడంతో ఆలయాల వద్ద సందడి నెలకొంది. మరోపక్క మొహర్రం సందర్భంగా ఊరూరా పీరీల ఊరేగింపు వైభవంగా సాగింది. వీధుల్లో పీరీలతో ఊరేగింపు నిర్వహించగా కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

◀ ఖమ్మం అభయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దర్శనానికి బారులుదీరిన భక్తజనం

9లో

ఖమ్మం బ్రాహ్మణ బజార్‌లో పీరీల ఊరేగింపు సందర్భంగా భారీగా హాజరైన భక్తులు ▶



న్యూస్‌రీల్

హైవే అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



మంత్రి తుమ్మలకు డిజైన్లను వివరిస్తున్న అధికారి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యాన జాతీయ రహదారుల శాఖ అధికారులతో బుధవారం రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గాప్రసాద్ ఎంట్రీ, ఎగ్జిట్ల డిజైన్లను వివరించారు. అయితే, రైతులు నష్టపోకుండా తక్కువ భూమి అవసరమయ్యే డిజైన్‌ను ఆమోదించాలని మంత్రి సూచించారు. అలాగే, ముదిగొండ నుంచి వెంకటగిరి మధ్య ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున నాలుగులేన్ల రహదారిగా విస్తరించి స్టేట్ హైవే అథారిటీకి అప్పగించాలని అధికారులకు మంత్రి తుమ్మల లేఖ రాశారు.

మధిరలో పద్మావతి, ఖమ్మంలో పట్నాకు హాల్టింగ్

ఖమ్మం రాపర్తినగర్: కరోనా సమయాన పలు రైళ్లను రద్దు చేసిన అధికారులు ఆతర్వాత పునరుద్ధరించినా చాలా స్టేషన్లలో హాల్టింగ్ ఇవ్వలేదు. ఈనేపథ్యాన ప్రయాణికుల వినతి మేరకు తిరుపతి – సికింద్రాబాద్ మధ్య నడిచే పద్మావతి(12763) ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 20నుంచి మధిర రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే, విశాఖపట్నం – మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్(12861)ను ఈనెల 21నుంచి మధిరలో నిలపనున్నట్లు తెలిపారు. ఇక ఎర్నాకులం – పట్నా ఎక్స్‌ప్రెస్ రైలు (22669) ఈనెల 27వ తేదీ నుంచి ఖమ్మం స్టేషన్‌లో ఆగుతుందని వెల్లడించారు.


కమనీయంగా కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

మాఫీ సరే.. ఆంక్షల మాటేమిటి?

రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికంపై అయోమయం

- అర్హులందరికీ వర్తిస్తుందని చెబుతున్నా రైతుల్లో ఆందోళన
- రూ.2లక్షలకు పైబడిన రుణాలపై అస్పష్టత
- ఆంక్షలతో ఆశలు వదులుకుంటున్న అన్నదాతలు
- జిల్లాలో 3.21 లక్షల మందికి రూ.2,300 కోట్ల మాఫీ అంచనా



ఖమ్మంవ్యవసాయం: రుణమాఫీకి ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాలపై రైతులు పెదవి విరుస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంట రుణాల మాఫీకి ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేసింది. వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులే కాక జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంచి 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న పంట రుణాలు, రెన్యూవల్ చేసుకున్న రూ.2లక్షల మేర రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నిర్దేశిత కాలంలో అసలు, వడ్డీతో కలిపి రూ.2 లక్షల వరకు ఉన్న బకాయిలకూ వర్తింపజేస్తామని వెల్లడించారు. కాగా, కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామని చెప్పడం, రేషన్‌కార్డును ప్రామాణికం చేయడంతో పాటు రూ.2 లక్షలకు పైగా ఉన్న అప్పులు చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని ప్రకటించడం రైతులను అయోమయానికి గురి చేస్తోంది.

రేషన్‌కార్డులు ఏవీ?

కుటుంబం ప్రాతిపదికన రూ.2 లక్షల మేర పంట రుణాల మాఫీకి రేషన్‌కార్డును ప్రామాణికం చేశారు. కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ వర్తిస్తుందని చెప్పగా.. కొన్నేళ్లుగా రేషన్ కార్డులు జారీ చేయడంలేదు. మరోపక్క రేషన్ కార్డుతో ప్రమేయం లేకుండానే బ్యాంకర్లు పాస్‌బుక్‌ల ఆధారంగా పంట రుణాలు ఇచ్చారు. ఈనేపథ్యాన ప్రభుత్వం రేషన్ కార్డుకు ముడిపెట్టడంతో చాలామంది రుణమాఫీకి దూరమయ్యే ప్రమాదముంది. అంతేకాకుండా కొత్తగా పెళ్లయి విడిపోయి వ్యవసాయం చేసుకుంటున్న కుటుంబాలకు రేషన్‌కార్డులు లేకపోవడంతో వీరి పరిస్థితి ఏమిటన్నది తేలడం లేదు. ఇక రూ.2లక్షలకు పైగా రుణం తీసుకుంటే అంతకు మించిన రుణం చెల్లిస్తేనే పథకం వర్తింపచేస్తామని వెల్లడించడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

నేడు 57,857 మంది ఖాతాల్లో జమ

రైతు రుణమాఫీని గురువారం అధికారికంగా ప్రారంభించనుండగా.. తొలుత రూ.లక్ష లోపు రుణాలు ఉన్న వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామని ప్రకటించింది. ఈనేపథ్యాన జిల్లాలో రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న రైతులు 57,857 మంది ఉన్నారని తేల్చారు. ఈ జాబితాను రైతులను తొలిదశ పంటల మండలం, క్లస్టర్ల, గ్రామం వారీగా విడుదల చేశారు. అయితే, వీరు రూ.లక్ష లోపు రుణం తీసుకున్నట్లు చెబుతున్నా ఎంత మొత్తమనేది జాబితాలో పొందుపర్చలేదు. అంతేకాక రూ.లక్షలోపు జాబితాలో కేవలం 57 వేల మందే ఉండడంతో రైతుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేగాక కొన్ని గ్రామాల పేర్లు లేవని చెబుతున్నారు. కాగా, రుణమాఫీలో భాగంగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే ప్రక్రియను సీఎం, మంత్రులు హైదరాబాద్‌లో అధికారికంగా ప్రారంభించనుండగా... జిల్లాలోని 21 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమ వీక్షణ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. అలాగే, రైతు రుణమాఫీ నేపథ్యాన గ్రామగ్రామాన సంబరాల నిర్వహణకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమవుతున్నారు.

డీసీసీబీ పరిధిలో రూ.908.27 కోట్లు

ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ఆధారంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పరిధిలో రూ.908.27 కోట్ల మేర పంట రుణాలు మాఫీ అయ్యే అవకాశముంది. నాలుగు జిల్లాల్లో వ్యాపించి ఉన్న డీసీసీబీ పరిధిలోని 100 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రుణాలు తీసుకున్న 1,69,864 మంది రైతులు అర్హత సాధించారు. ఇందులో ఖమ్మం జిల్లాకు చెందిన 1,16,291మంది రైతులకు రూ.647.76కోట్లు, భద్రాద్రి జిల్లాలో 47,003మంది రైతులకు రూ.235.23 కోట్లు, మహబూబాబాద్ జిల్లాలో 5,195 మంది రైతులకు రూ.18.33కోట్లు, ములుగు జిల్లాలో 1,375మంది రైతులు తీసుకున్న రూ.6.95కోట్ల రుణాలు మాఫీ కానున్నాయి.

3.21 లక్షల మందికి అర్హత

రుణమాఫీ పథకం జిల్లాలో 3.21 లక్షల మంది రైతులకు వర్తించే అవకాశముందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఆయా రైతులు రూ.2,300 కోట్ల మేర రుణాలు తీసుకున్నారని తెలుస్తోంది. ఇందులో సహకార సంఘాల ద్వారానే 40 శాతం రుణాలు తీసుకున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం వానాకాలం పంటల సీజన్ జోరందుకున్న నేపథ్యాన రుణమాఫీ రైతుల ఖాతాల్లో జమ అయితే.. తిరిగి అవే బ్యాంకుల ద్వారా రుణాలు పొందే అవకాశముంది. కానీ ప్రభుత్వ మార్గదర్శకాలతో ఎందరికి రుణమాఫీ అవుతుందనే అంశంపై అయోమయం నెలకొంది.

నా పరిస్థితి ఏమిటి?



నాకు పదెకరాల భూమి ఉంది. పీఏసీఎస్ నుంచి రూ. 1.25 లక్షల పంట రుణం తీసుకున్నా. ఏటా వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకుంటున్నాను. కానీ నాకు రేషన్‌కార్డు లేదు. ఇప్పుడు రుణమాఫీ చేస్తామని చెబుతున్నా నా పరిస్థితి ఏమిటో తెలియడం లేదు.
– శీలం నారాయణ రెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం, ఎర్రుపాలెం మండలం

అప్పు చెల్లించడం భారమే..



పంటల సాగుకు బ్యాంకు నుంచి రూ. 2.50 లక్షల అప్పు తీసుకుని ఏటా వడ్డీ చెల్లిస్తున్నా. ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ ప్రకటించడం బాగుంది. కానీ అంతకు మించి ఉన్న రుణం చెల్లిస్తేనే మాఫీ అవుతుందని చెప్పడం ఇబ్బందిగా మారుతుంది.
– తుమ్మల రాణాప్రతాప్, వల్లాపురం, వైరా మండలం

భూమి ఇక్కడ.. కార్డులు అక్కడ



ఎకరంన్నర భూమి ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెంలో ఉంది. నివాసం పొరుగునే ఏపీలోని పైడూరుపాడు. సాగుకు జమలాపురం యూనియన్ బ్యాంక్‌లో రూ.1.10 లక్షల రుణం తీసుకోగా.. ఇక్కడ రేషన్, ఆధార్ కార్డులు లేకపోవడంతో అయోమయం నెలకొంది.
– మంద మురళీమోహన్, పైడూరుపాడు, బుచ్చిరెడ్డిపాలెం

ఎదురుచూస్తున్నా...



వ్యవసాయమే జీవనాధారమైన నాకు ఎకరం భూమి ఉంది. పంటల సాగుకు బ్యాంకులో రూ.80 వేల అప్పు తీసుకున్నా. ఎప్పటికప్పుడు వడ్డీ చెల్లిస్తున్నా. ప్రభుత్వ రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నా. బ్యాంకులో జమ అయితే పంటల సాగుకు మళ్లీ అప్పు తీసుకుంటా.
– బానోత్ రామచంద్రు, గంగబండ తండా, కూసుమంచి మండలం

నేటి నుంచి టీజీ డీఎస్సీ

- జిల్లాలో ఆరు కేంద్రాలు, 25,204మంది అభ్యర్థులు
- రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు
- ఆన్‌లైన్‌లో పరీక్ష, నిమిషం ఆలస్యమైనా బయటకే...



ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు గురువారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు జరగనున్నాయి. ఈసారి ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తుండగా జిల్లాలోని ఆరు ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు షిఫ్ట్‌లో పరీక్షలు జరుగుతాయి. ఉదయం పరీక్షకు 9గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల వరకే అనుమతిస్తామని, ఆతర్వాత వచ్చే వారికి అనుమతి ఉండదని అధికారులు వెల్లడించారు.

తొలిసారి ఆన్‌లైన్ విధానంలో...

ఉద్యోగ నియామక పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగొద్దనే భావనతో రాష్ట్రప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యాన డీఎస్సీ పరీక్షలు కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. కాగా, జిల్లాలో 137మంది దివ్యాంగ అభ్యర్థులు సహాయకులు కావాలని దరఖాస్తు చేసుకున్నారు.

ఆరు కేంద్రాలు... 25,204మంది అభ్యర్థులు

డీఎస్సీ పరీక్ష నిర్వహణకు జిల్లాలోని ఆరు ఇంజనీరింగ్ కళాశాలలను ఎంపిక చేశారు. ఖమ్మం అల్లీపురంలోని బొమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో 3,120మంది, ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలోని దరిపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో 3,900మంది, సత్తుపల్లి సమీపంలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో 4,784మంది, ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా సమీపంలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 7,280మంది, స్వర్ణభారతి ఇంజనీరింగ్ కళాశాల(ఎస్‌బీఐటీ)లో 3,120మంది, కొణిజర్ల మండలం తనికెళ్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో 3వేల అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఇదిలా ఉండగా ఒక్కోరోజు ప్రతీ సెంటర్‌లో సుమారు 900మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. కాగా, జిల్లాతో పాటు ఇతర జిల్లాల అభ్యర్థులకూ ఇక్కడ సెంటర్లు కేటాయించారు.

పటిష్టంగా పరీక్షల నిర్వహణ

జిల్లాలో డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని డీఈఓ సోమశేఖరశర్మ వెల్లడించారు. ఆరు ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామని చెప్పారు. అభ్యర్థులు తమ సందేహాల నివృత్తి కోసం 99512 12603 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని ఆయన తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్

ఖమ్మంక్రైం: డీఎస్సీ పరీక్షలు గురువారం నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు జరగనున్నందున పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ చట్టం–2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) ప్రకారం 163 సెక్షన్ అమలు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఖమ్మంలోని ఆరు కేంద్రాల్లో ప్రతిరోజు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.ఈ మేరకు ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు సెక్షన్ 163 అమల్లో ఉంటుందని తెలిపారు. తద్వారా కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి ఉండొద్దని, సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి ఉండదని పేర్కొన్నారు. ఇక ట్రాఫిక్ అంతరాయం కలగకుండా అన్ని చర్యలు తీసుకోనున్నందున, కేంద్రాల పరిసరాల్లో పెట్రోలింగ్ పార్టీలు పహారా కాస్తాయని సీపీ తెలిపారు.

‘అమృత్’ పనుల్లో వేగం పెంచండి

రైల్వే అధికారులకు డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్ ఆదేశం



రైల్వే స్టేషన్ ఆవరణలో అధికారులకు సూచనలు చేస్తున్న భరతేష్ కుమార్ జైన్

కొత్తగూడెంఅర్బన్: అమృత్ భారత్ పథకంలో భాగంగా భద్రాచలం రోడ్(కొత్తగూడెం) రైల్వే స్టేషన్‌లో చేపట్టిన పనుల్లో వేగం పెంచి గడువు నాటికి పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం భరతేష్‌కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రైల్వే స్టేషన్‌లో నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ప్రయాణికులకు ఆటంకం కలగకుండా పనులు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంతో పాటు సింగరేణి ఏరియాల నుంచి వచ్చే ప్రయాణికులకు అన్ని సదుపాయాలు కల్పించేలా పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ రైల్వే స్టేషన్ అమృత్ భారత్ పథకం కింద ఎంపికైనందున స్టేషన్ యాక్సెస్, సర్క్యులేటింగ్ ఏరియాలు, వెయిటింగ్ హాళ్లు, టాయిలెట్లు, అవసరమైన లిఫ్ట్, ఎస్కలేటర్లు, పరిశుభ్రత, ఉచిత వైఫై వంటి సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. అనంతరం సత్తుపల్లి పార్థసారధి పురంలోని కోల్ లోడింగ్ పాయింట్‌ను పరిశీలించారు. ఈకార్యక్రమంలో రైల్వే అధికారులు పాల్గొన్నారు.

‘మహాలక్ష్మి’ కోసం ప్రత్యేక ఫోన్ నంబర్లు

ఖమ్మంమయూరిసెంటర్: మహాలక్ష్మి ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీలో ప్రత్యేక ఫోన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆర్ఎం సరిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సుల్లో ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదు చేసేందుకే కాక బస్సుల రాకపోకల వివరాలు తెలుసుకునేందుకు బస్టాండ్ల వారీగానే కాక డిపో మేనేజర్లకు ఫోన్ నంబర్లుకేటాయించామని వెల్లడించారు. మహిళలు సమస్యలపై ఫిర్యాదు చేయడంతో పాటు సమాచారం తెలుసుకునేందుకు ఆయా నంబర్లకు ఫోన్ చేయాలని ఆర్ఎం సూచించారు.

బస్టాండ్	విచారణ	డిపో మేనేజర్
ఖమ్మం కొత్త బస్టాండ్	99592 25979	99592 25958
ఖమ్మం పాత బస్టాండ్	99592 25965	99592 25958
మధిర	73829 25289	99592 25961
సత్తుపల్లి	99592 25990	99592 25962
భద్రాచలం	99592 25987	99592 25960
కొత్తగూడెం	99592 25982	99592 25959
మణుగూరు	89853 61796	99592 25963

చకచకా తీగల వంతెన!



- మున్నేరు వద్ద జోరందుకున్న పనులు
- ఈ ఏడాది వర్షాలు లేక చేరని వరద
- దీంతో మరింత వేగం పెంచిన కాంట్రాక్టు సంస్థ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరం–ఖమ్మం రూరల్ మండలాల మధ్య నాయుడుపేట సమీపాన మున్నేరుపై ఉన్న పాతవంతెన స్థానంలో నిర్మిస్తున్న తీగల వంతెన పనులు చకచకా సాగుతున్నాయి. ఈ వంతెన నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు కాగా.. 700 మీటర్ల మేర తీగల వంతెన నిర్మిస్తారు. మిగతాది అప్రోచ్ వంతెన ఉండనుంది. నాలుగు నెలలు క్రితం పనులు మొదలు పెట్టగా ఇప్పటికే మున్నేరులో వంతెనకు అవసరమైన పిల్లర్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది.

తొలుత మున్నేరులో...

ఈ ఏడాది ఇప్పటివరకు పెద్ద వర్షం కురవలేదు. దీంతో మున్నేరుకు వరద పోటెత్తడం లేదు. ఫలితంగా బ్రిడ్జి నిర్మాణ పనులు ఆటంకం లేకుండా కొనసాగుతున్నాయి. ఒకవేళ వరద వచ్చినా పనులకు ఇబ్బంది ఎదురుకాకుండా తొలుత ఏరు పరిధిలో పిల్లర్లు నిర్మిస్తున్నట్లు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

మొత్తం 14 పిల్లర్లు

మున్నేరు వంతెనకు 14 పిల్లర్లు నిర్మించాల్సి ఉంటుంది. ఇందులో తీగల వంతెనకు నాలుగు నిర్మించనుండగా.. మిగతా వాటిపై సాధారణ వంతెన వస్తుంది. మొత్తం రూ.180 కోట్ల నిధులు మంజూరు కాగా.. నిర్మాణానికి రూ.120 కోట్ల మేర వెచ్చించనున్నట్లు తెలుస్తోంది. మిగిలిన మొత్తాన్ని భూసేకరణతో పాటు ఇతరత్రా పనులకు కేటాయించారు. కాగా, ఇప్పటికే 14 పిల్లర్లకు సంబంధించి ఫౌండేషన్ పనులు పూర్తయ్యాయి. ఇంకొన్ని పిల్లర్ల నిర్మాణం కూడా మొదలుపెట్టారు. వంతెన నిర్మాణానికి రెండేళ్ల గడువు నిర్ణయించగా.. అంతకుముందే సిద్ధమవుతుందని చెబుతున్నారు.

భూసేకరణపై దృష్టి

తీగల వంతెన నిర్మాణానికి అవసరమైన భూమి సేకరించి తమకు అప్పగించాలని ఆర్అండ్‌బీ అధికారులు రెవెన్యూ శాఖకు లేఖ రాశారు. ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ మండలాల రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆర్అండ్‌బీ అధికారులు సూచించిన మార్క్ ప్రకారం ఎంతమేర భూమి అవసరమో లెక్క తేల్చాల్సి ఉంది. ఆపై ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు పరిహారం చెల్లిస్తారు. అయితే, ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదని తెలిసింది.

వంతెన నిర్మాణం పూర్తయితే...

తీగల వంతెన నిర్మాణం పూర్తయితే.. ప్రస్తుతం ప్రమాదకరంగా మారిన మున్నేరుపై కాల్వొడ్డులోని పాత వంతెనపై రాకపోకలు నిషేధించే అవకాశం ఉంది. ఇప్పటికే బైపాస్ రోడ్డులో ఉన్న వంతెన పైనుండి భారీ వాహనాలతో పాటు నగరంలోకి రావాల్సిన అవసరం లేని వాహనాలు కూడా వచ్చివెళ్తున్నాయి. వ్యాపార సముదాయాలకు సామగ్రి తీసుకొచ్చే వాహనాలే కాక ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన వారు పాత వంతెనపై నుండి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పాత వంతెన దెబ్బతిని ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశముందని ప్రభుత్వం నూతనంగా తీగల వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కాగా, మున్నేరుకు వరద వచ్చినప్పుడల్లా పాత వంతెనపై రాకపోకలు నిలిపేస్తున్నారు. ఇప్పుడు కొత్త వంతెన అందుబాటులోకి వస్తే బైపాస్‌రోడ్డు వంతెనపై తాకిడి తగ్గి.. నగరంలోకి రాకపోకలు సాగించే వారికి ఇక్కట్లు తీరనున్నాయి.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రతిభ


వినయ్

ఖమ్మం స్పోర్ట్స్: మెదక్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఖమ్మంకు చెందిన అబ్బురి వినయ్‌కు సింగిల్స్‌లో ద్వితీయస్థానం దక్కించుకున్నాడు. అండర్–15 విభాగంలో పోటీ పడిన ఆయన వరుస విజయాలతో ఫైనల్స్‌కు చేరి హోరాహోరీగా పోరాడి ద్వితీయస్థానంలో నిలవడంతో కేరళలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రస్తుతం వినయ్ హైదరాబాద్‌లో శిక్షణ పొందుతుండగా, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ జి.వెంకట్రావు, అధ్యక్ష, కార్యదర్శులు టి.వెంకట్రావు, ఎస్.ఉప్పల్‌రెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, కోచ్ చింత సురేష్ అభినందించారు.

బాలుడి చికిత్సకు కాలనీవాసుల చేయూత


నగదు అందజేస్తున్న కాలనీవాసులు

ఖమ్మంరూరల్: మండలంలోని సాయిగణేశ్‌నగర్‌కు చెందిన బాలుడు భరత్ ఇటీవల డాబాపై కోతులను అదిలించేందుకు వెళ్లగా విద్యుత్ తీగలు తాకడంతో షాక్ కొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనకు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా కాలనీవాసులు అండగా నిలిచారు. కాలనీవాసుల నుంచి సేకరించిన రూ.2 లక్షలను బాలుడి తల్లిదండ్రులు మధురెడ్డి, శోభకు హైదరాబాద్‌లో బుధవారం అందించారు. కార్యక్రమంలో సాయిగణేశ్‌నగర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బైరెడ్డి నరేందర్‌రెడ్డితో పాటు ప్రసాద్, జీవన్‌రెడ్డి, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి దానవాయిగూడెం వద్ద పట్టాలపై బుధవారం గుర్తుతెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని గుర్తించారు. అయితే, మృతదేహం ముక్కలు కావడంతో పోలీసుల సూచన మేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో శరీర భాగాలను చేర్చి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని.. ఆత్మహత్య చేసుకున్నాడా, ప్రమాదవశాత్తు మృతి చెందాడా తెలియాల్సి ఉందని జీఆర్పీ ఎస్‌ఐ పి.భాస్కర్‌రావు తెలిపారు.

ఎర్రుపాలెం సమీపాన...

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం – తొండలగోపవరం రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (35) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం వైపు వెళ్లే లైన్‌పై వెళ్తున్న రైలు కిందపడి సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆకుపచ్చ రంగు టీషర్ట్, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించి మెడలో సిలువ గొలుసు కలిగిన ఆయన వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించకపోవడంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589, 87126 58607 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దాడి ఘటనలో ఐదుగురిపై కేసు

కల్లూరు: దాడి ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని శాంతినగర్‌కు చెందిన కంటిపూడి రాణి తన కుమారుడు గోవర్ధన్‌తో ఈ నెల 15వ తేదీన రాత్రి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా, మార్గమధ్యలో అదే ప్రాంతానికి చెందిన ఐదుగురు అడ్డుపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన వారు నగదు లావాదేవీలపై గోవర్ధన్‌ను దూషిస్తూ రోకలిబండతో దాడి చేయగా, రాణికి తాకడంతో ఆమె కంటిపై తీవ్ర గాయమైంది. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై కేసు

చింతకాని: తండ్రిపై దాడి చేసిన వ్యక్తితో పాటు ఆయన భార్యపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన తుడుం బక్కయ్యపై ఆయన చిన్న కుమారుడైన ఎల్లేశ్ – లావణ్య దంపతులు ఈ నెల 14, 16వ తేదీల్లో దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనలో బక్కయ్య చేయి విరగగా, అడ్డుకోబోయిన తల్లిని కూడా కొట్టారు. దీంతో బక్కయ్య ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్ మీరా తెలిపారు.

అమ్మమ్మను హత్యచేసిన మనవడి అరెస్ట్

ఖమ్మంక్రైం: గంజాయికి అలవాటు పడిన వ్యక్తి పింఛన్ డబ్బు ఇవ్వలేదని అమ్మమ్మను హత్య చేయగా.. నిందితుడిని ఖమ్మం టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ బాలకృష్ణ వెల్లడించారు. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన అమరబోయిన రాంబాయమ్మపై ఆమె మనవడు ఉదయ్‌కుమార్ దాడి చేసి సోమవారం అర్ధరాత్రి హత్య చేసిన విషయం విదితమే. నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ సూరజ్, సిబ్బంది పాల్గొన్నారు.

నో నో.. కోనోకార్పస్

- జిల్లావ్యాప్తంగా ఏపుగా పెరిగి చెట్లు
- త్వరగా బతుకుతాయని విరివిగా నాటిన వైనం
- పుప్పొడితో పాటు పూలవాసనతో ప్రమాదమంటున్న వైద్యులు
- ప్రస్తుతం నాటడంపై నిషేధం
- కొన్నిచోట్ల కొట్టేస్తున్నా.. అంతటా కదలని యంత్రాంగం

వైరా: ఏపుగా పెరుగుతాయి.. నీరు పట్టాల్సిన పనీ లేదు.. అంటూ గత ప్రభుత్వ హయంలో హరితహారంలో భాగంగా కోనోకార్పస్ (ఏడు ఆకులు) మొక్కలు నాటారు. పల్లె, పట్నం తేడా లేకుండా వీటిని నాటగా సుందరీకరణ పేరుతో జనసంచారం అధికంగా ఉండే జాతీయ రహదారి డివైడర్లు, ఖాళీ ప్రదేశాల్లో, ప్రకృతి వనాల్లో విపరీతంగా పెంచారు. ప్రస్తుతం ఇవి ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. అయితే, కోనోకార్పస్ మొక్కల పూలకు సంబంధించి పుప్పొడి రేణువులు రోడ్ల వెంట పడగా.. వర్షాకాలంలో అవి గింజలుగా రూపాంతరం చెంది మళ్లీ మొక్కలు పుట్టుకొస్తున్నాయి. కాగా, పూల వాసనతో అలర్జీ, ఆస్తమా వ్యాధుల భయం పొంచి ఉందని.. ఊపిరితిత్తులపై ప్రభావం చూపడమేకాక శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వ్యాపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యాన ఈ మొక్కలు నాటొద్దని ప్రభుత్వం ఆదేశించడంతో కొన్ని చోట్ల తొలగిస్తున్నా.. మిగతా చోట్ల అధికారులు మేల్కొనకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు అనే నినాదంతో గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ మేరకు ఏటా వర్షాకాలంలో విరివిగా మొక్కలు నాటగా ఇందులో కోనోకార్పస్ మొక్కలు ఎక్కువగా ఉన్నాయి. కానీ వేగంగా పెరిగే


వైరా రిజర్వాయర్ ఆనకట్టపై పెరిగిన కోనోకార్పస్ చెట్లు

లక్షణం ఉండడంతో పాటు పచ్చగా శంకు ఆకారంలో కనిపించే ఈ మొక్కలు ఇప్పుడు ప్రమాదకరంగా మారాయి. జిల్లాలో వైరా, సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీలతో పాటుగా గ్రామపంచాయతీల్లోనూ డివైడర్ల మధ్య ఫుట్‌పాత్‌ల మధ్య నాటించారు. చూడడానికి అందంగా కనిపిస్తున్నా మానవళితో పాటు పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్నాయని చెబుతున్నారు. రిజర్వాయర్ల వెంట, పార్కుల్లో వాకింగ్‌కు వచ్చే వారు ఇటీవల శ్వాసకోశ వ్యాధులకు గురవడానికి ఈ మొక్కలే కారణమని తెలుస్తోంది.

ప్లాంటేషన్ ఆపేశారు.. తొలగించరా?

కోనోకార్పస్‌తో లాభం కన్న నష్టమే అధికంగా ఉంటుందని వైద్యులు అంటున్నారు. దీంతో పలు దేశాలు, రాష్ట్రాలో ఈ మొక్కలపై నిషేధం విధించగా జిల్లాలోనూ మొక్కలు నాటడం నిలిపేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇప్పటికే నాటిన మొక్కలను ఖమ్మంలోని పలు ప్రాంతాలతో పాటు వైరాలోని కొన్నిచోట్ల నరికివేయించారు. మిగతా చోట్ల అలాగే వదిలేయడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇకనైనా మొక్కలన్నింటినీ తొలగించి వీటి స్థానంలో మర్రి, వేప, రావి, గానుక వంటి మొక్కలు నాటాలని పలువురు కోరుతున్నారు.

మొక్కలు తొలగించండి..



ప్రమాదకరంగా మారిన కోనోకార్పస్ మొక్కలను వైరా రిజర్వాయర్ ఆనకట్టపై నాటారు. ప్రధాన రహదారి వెంటకూడా ఉన్నాయి. ఈ చెట్లతో వచ్చే వాసన ఇబ్బంది అని చెబుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చెట్లను తొలగించాలి.

–శీలం వెంకటనర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు

అధికారులు స్పందించాలి..



కోనోకార్పస్ చెట్లు ప్రమాదకరమైనవని వింటున్నాం. వైరా రిజర్వాయర్ ఆనకట్టపై ఈ చెట్లు ఉన్నాయి. వీటిని తొలగించాలని నీటిపారుదల శాఖ, మున్సిపల్ అధికారులు లేఖ ఇస్తే మా తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటాం.

–కె.అరవింద్, అటవీశాఖ రేంజ్ ఆఫీసర్, తల్లాడ

ప్రమాదకరమైనవే..



కోనోకార్పస్ చెట్లు ప్రమాదకరమైనవే. ఇటీవల వీటి బారిన పడిన వారు చికిత్స కోసం వస్తున్నారు. ఇవి ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు వ్యాపించేందుకు కారణమవుతున్నాయి. గుజరాత్, తదితర రాష్ట్రాల్లో ఈ మొక్కలను నిషేధించారు.

–ఎస్.సతీశ్‌కుమార్, ప్రైవేట్ వైద్యుడు

ముదిగొండ మండలంలో...

ముదిగొండ: ముదిగొండ మండలంలోని పలు చోట్ల రహదారులపై సందరీకరణ కోసం కోనోకార్పస్ మొక్కలు నాటగా.. ఇప్పుడు ప్రజారోగ్యం, పర్యావరణంపై ప్రభావం చూపుతున్నాయని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ముదిగొండ మండలంలోని ప్రతీ గ్రామంలో నివాస గృహాల వెంట, పల్లెప్రకృతి వనాల్లో ఇవి కనిపిస్తున్నాయి. ముదిగొండలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న చైనా ఫ్యాక్టరీకి ఇరువైపులా ఈ మొక్కలు 30 అడుగుల మేర పెరిగాయి. మిగతా చోట్ల కూడా అదే పరిస్థితి ఉండగా మొక్కలతో ఇబ్బందేనని తెలిసినా తొలగింపుపై అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.


ముదిగొండ రైతు వేదిక రహదారిలో ఏపుగా పెరిగిన మొక్కలు

ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందే..



కోనోకార్పస్ మొక్కలతో శ్వాసకోస, చర్మవ్యాధులు వస్తాయి. ఈ మొక్కలతో చెడు ప్రభావమే ఉన్నందున తొలగించడం మంచిది. మా ఆస్పత్రి ఆవరణలో కూడా ఉన్న మొక్కలను తొలగించాలని చెప్పాం. గ్రామ కార్యదర్శి, ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్తాం.

–డాక్టర్ ధర్మేందర్, వల్లభి పీహెచ్‌సీ వైద్యాధికారి

వేరే మొక్కలు నాటిస్తాం..



ఈ మొక్కల వల్ల చెడు జరుగుతోందని తెలియడంతో జనావాసాల మధ్య ఉన్న వాటిని తొలగించాలని చెప్పాం. ఊరి చివరన నర్సరీలు, పల్లె ప్రకృతి వనాల్లోనూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం గుర్తించిన ప్రాంతాల్లో తొలగించి.. ఆ మొక్కల స్థానంలో ఇతరత్రా నాటేలా చూస్తాం.

–శ్రీధర్‌స్వామి, ఎంపీడీఓ, ముదిగొండ

అటు దొంగలు.. ఇటు ట్రాఫిక్

- మధిర వాసులను వేధిస్తున్న సమస్య
- పోలీసులు పెట్రోలింగ్ మరిచారని ఆరోపణలు
- కాసులు వచ్చే పనులపైనే దృష్టి సారిస్తున్నట్లు విమర్శలు


అలంకార ప్రాయంగా మిగిలిన సీసీ కెమెరాలు


సీసీ కెమెరా లేని భగత్‌సింగ్ సెంటర్

మధిర: మధిర నియోజకవర్గ కేంద్రంలో ఇటీవల ద్విచక్ర వాహనాల చోరీలు సర్వసాధారణమయ్యాయి. వరుసగా రోజుకొకటి అన్నట్లు బైక్ చోరీలు జరుగుతున్నాయి. అయినా నియంత్రించడం, నిఘా పెంచడంపై పట్టణ పోలీసులు విఫలమవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. మధిర ప్రాంతం ఏపీకి సరిహద్దుగా ఉండగా.. నిత్యం వందలాది మంది ప్రజలు అక్కడి నుంచి మధిరకు రాకపోకలు సాగిస్తారు. ఈ క్రమంలో పటిష్ట నిఘా లేకపోవడంతో చోరీలు నిత్యకృత్యమయ్యాయి.

సీసీ కెమెరాలు ఎక్కడ..

మధిరలో చోరీ చేసిన వారు ఏపీలోకి వెళ్లిపోయే అవకాశముంది. ఆ తర్వాత నిందితులను గుర్తించడం కష్టమవుతోంది. ఈ నేపథ్యాన సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటుచేస్తే ఫలితం ఉంటుందని తెలిసినా పట్టణ పోలీసులు ఆ దిశగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. పట్టణ కూడళ్లలో పలుచోట్ల సీసీ కెమెరాలు ఉన్నా పనిచేయడం లేదు. గతంలో స్థానిక వ్యాపారులపై ఒత్తిడి తీసుకొచ్చి సీసీ కెమెరాల ఏర్పాటు చేయించినా అవి చాలా సాంకేతిక లోపాలతో పనిచేయడం లేదు. రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపాన భగత్‌సింగ్ సెంటర్, శాంతి థియేటర్, రెడ్డి గార్డెన్స్, వినాయకుడి గుడి సెంటర్ తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఎక్కడైనా చోరీ జరిగినప్పుడు నిందితులను గుర్తించడం కష్టమవుతోంది.

ట్రాఫిక్ ఇక్కట్లు..

మధిర నియోజకవర్గ కేంద్రానికి రాకపోకలు సాగించే ప్రజల సంఖ్య పెరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ప్రధానంగా రాయపట్నం సెంటర్, అంబేడ్కర్ సెంటర్, వేపచెట్టు సెంటర్, ఆర్‌వీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు కనీస చర్యలు చేపట్టడం లేదు. సాయంత్రం సమయాన మరింత రద్దీ ఉంటోంది. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు కనీసం సిబ్బందిని కూడా నియమించడం లేదు. ఒక్కోసారి పాదచారులకు కూడా నడవలేని పరిస్థితి ఎదురవుతున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నా దృష్టికి వచ్చింది..

పోలీసులపై వస్తున్న ఆరోపణల అంశంపై సీఐ మధు వివరణ కోరగా.. వివిధ సమస్యలపై రాజకీయ పార్టీల నాయకులు లేదా ఆయా గ్రామాల పెద్దలు ఫోన్ చేసినప్పుడు లిఫ్ట్ చేయడం లేదని తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అలాగే, ఇసుక ట్రాక్టర్ల విషయంలో తీసుకున్న డబ్బు వెనక్కి ఇచ్చేసినట్లు తెలిసిందని చెప్పారు. లోటుపాట్లను సరి చేసుకోవాలని తరచూ చెబుతూనే ఉన్నామని, ఈ విషయాన్ని ఏసీపీ దృష్టికి సైతం తీసుకెళ్లామని తెలిపారు.

వరుస ఆరోపణలు

ట్రాఫిక్ సమస్యలు, వరుస చోరీల అంశాన్ని పక్కన పెడితే మధిర పట్టణ పోలీసులపై ఇతర అంశాల్లో వరుస విమర్శలు వస్తుండటం గమనార్హం. ఇటీవల ఇల్లూరు సమీపాన వైరా నదిలో ఖమ్మంపాడుకు చెందిన పలువురు ఇంటి యజమానులు ఇసుక తోలుకుంటున్నారు. దీంతో పట్టణానికి చెందిన పోలీస్ బాస్ రేవులోకి వెళ్లి 12 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని యజమానుల నుంచి రూ.60 వేలు వసూలు చేసినట్లు తెలిసింది. అయితే, ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డబ్బులు తిరిగి ఇచ్చేయడంతో పాటు ఇలాంటివి పునరావృతం కానివ్వొద్దని మందలించినట్లు సమాచారం. ఇక పోలీసుస్టేషన్‌కు వచ్చే దరఖాస్తుదారులతో మర్యాదగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు చెబుతున్నా మధిరలో మాత్రం అలాంటివేవీ అమలుకు నోచుకోవడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. కాగా, పట్టణంలోని వైరా రోడ్డులో ఒక థియేటర్ ఎదురుగా ఉన్న భవనంపై పేకాట శిబిరం నిర్వహణకు పోలీసులు లోపాయికారిగా సహకరించినట్లు ప్రచారం జరుగుతోంది. రాయపట్నం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ద్వారా పేకాట శిబిరం నిర్వహణకు కింది స్థాయి సిబ్బంది ద్వారా టౌన్ పోలీసుస్టేషన్‌లో అధికారికి నగదు పంపినట్లు తెలిసింది. ఇక ఒక అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ విషయమై అమ్మిన వ్యక్తి డబ్బు అందాక కూడా రిజిస్ట్రేషన్‌కు జాప్యం చేశాడు. దీంతో బాధితులు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆశ్రయించినా కేసు నమోదుకు తాత్సారం చేశారని తెలిసింది. అంతేకాక బాధితులనే బెదిరింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా పలు ఘటనల్లో కేసులు నమోదు చేయకుండా జాప్యం చేస్తున్నారని.. తమకు లాభం ఉంటే మాత్రం చకచకా పని కానిచ్చేస్తారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


కార్యాలయాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి/కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో సమీకృత గురుకులం, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్నారు. పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలతో మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, అధికారులు బుధవారం ఖమ్మం రూరల్ మండలంలోని పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఏసీపీ కార్యాలయం, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల ఏర్పాటుకు వరంగల్ క్రాస్‌లోని తరుణిహాట్‌ను, తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యనందించేందుకు ముందుకొచ్చిన స్వామి నారాయణ స్కూల్ యాజమాన్యానికి స్థలాన్ని ఇచ్చేందుకు శ్రీ సిటీ సమీపంలోని ప్రభుత్వ స్థలం, సమీకృత గురుకులాల ఏర్పాటుకు పొన్నేకల్‌లో స్థల పరిశీలన చేపట్టారు. ఆ తర్వాత పెదతండాలో మహిళా నర్సింగ్ కళాశాలను సందర్శించిన నాయకులు వసతుల కల్పన విషయమై మంత్రి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇక నేలకొండపల్లి మండలం పైనంపల్లి ఏటిపై రూ.6.50 కోట్లతో చెక్‌డ్యాం నిర్మాణానికి పైనంపల్లి, రామచంద్రాపురంలో పరిశీలించి రైతుల అభిప్రాయాలు సేకరించారు. నేలకొండపల్లి, తిరుమలాయపాలెం డీఈఈలు మన్మథరావు, రమేశ్‌రెడ్డి, నేలకొండపల్లి ఏఈ టి.నరేశ్‌తో పాటు ఎంపీపీ శ్రీనివాస్, నాయకులు శాఖమూరి రమేశ్, కొప్పుల చంద్రశేఖర్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, కె.హన్మంతరావు, యడవల్లి సైదులు, పల్లెబోయిన లక్ష్మీనారాయణ, యడవల్లి నాగరాజు, వీరారెడ్డి పాల్గొన్నారు. కాగా, కూసుమంచి మండలం జక్కేపల్లిలో చెక్‌డ్యాం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన నాయకులు ఈశ్వరమాధారం, జుజుల్‌రావుపేట గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించారు.


పైనంపల్లి వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

జూపెడలో విషాదం..

- అత్త గారింటికి వెళ్లి క్వారీలో మునిగి మృతి చెందిన గ్రామవాసి
- బిల్డర్‌గా పలువురికి సుపరిచితుడైన శ్రీపాల్‌రెడ్డి
- స్నేహితుడి కుటుంబంలోనూ ఇంకో ఇద్దరి మృత్యువాత


శ్రీపాల్‌రెడ్డి (ఫైల్)

తిరుమలాయపాలెం: పండుగ పూట ఆనందంగా గడపాల్సిన ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. తిరుమలాయపాలెం మండలం జూపెడకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, బిల్డర్ తిప్పారెడ్డి శ్రీపాల్‌రెడ్డి (47) స్నేహితుడి కుటుంబంతో కలిసి అత్తగారింటికి వెళ్లి ప్రమాదవశాత్తు మృత్యువాత పడడంతో కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.. జూపెడకు చెందిన శ్రీపాల్‌రెడ్డి ఖమ్మం, తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూనే బిల్డర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆయన భార్య శైలజ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. ఈ మేరకు శైలజ స్నేహితురాలైన ఏపీకి చెందిన నాగమణి – చామలిరాజు (45) కుటుంబంతో కలిసి మంగళవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్‌లోని దండుమైసమ్మ ఆలయం వద్ద శ్రీపాల్‌రెడ్డి బంధువులకు సంబంధించి శుభకార్యానికి హాజరయ్యారు. బుధవారం మొహర్రం సెలవు కావడంతో శ్రీపాల్‌రెడ్డి అత్తగారి ఊరైన బొప్పారం వెళ్లారు. అక్కడ సరదాగా గడిపాక శ్రీపాల్‌రెడ్డి, ఆయన పెద్ద కుమారుడు చేతన్‌రెడ్డి, చామలి రాజు, ఆయన ఇద్దరు కుమార్తెలు ఉషాంక, రితికతో పాటు శ్రీపాల్‌రెడ్డి బంధువుల అమ్మాయి వర్షిత కలిసి ఈత నేర్చుకోవడానికి బొప్పారం సమీపానే బిక్కేరు వాగుకు వెళ్లారు. అక్కడ నీరు లేకపోవడంతో చెరువు సమీపంలో క్వారీ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఈత తెలిసిన చేతన్‌రెడ్డి లోపలకు దిగగా.. ఉషాంక జారి పడుతుండటంతో ఆమెను కాపాడేందుకు రాజు, ఆపై శ్రీపాల్‌రెడ్డి, రాజు చిన్న కుమార్తె రితిక నీట మునిగారు. ఈ క్రమంలో రితికను మాత్రం చేతన్‌రెడ్డి కాపాడగా మిగిలిన ముగ్గురూ మృత్యువాత పడ్డారు. కాగా, పోస్టుమార్టం అనంతరం శ్రీపాల్‌రెడ్డి మృతదేహాన్ని స్వగ్రామమమైన జూపెడకు తీసుకురాగా కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అలాగే, వివిధ పార్టీ నాయకులు రామసహాయం నరేశ్‌రెడ్డి తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాగా, ప్రమాదంపై శ్రీపాల్‌రెడ్డి మామ నల్లుల ఉపేందర్‌రెడ్డి స్పందిస్తూ బొప్పారంలో కొన్నేళ్ల కిందట క్వారీ మూతపడినా గుంతలను పూడ్చకపోవడంతో నీళ్లు చేరి ప్రమాదానికి కారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటికి చుట్టుపుచూపుగా వచ్చిన ముగ్గురు మృత్యువాత పడడం తమను కలచివేస్తోందని కన్నీరుమున్నీరుగా రోదించారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

కారేపల్లి: షుగర్‌తో బాధపడుతున్న వ్యక్తికి కాలి గాయం కావడంతో చికిత్స కోసం కారేపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రాగా.. వైద్యం వికటించి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని మాణిక్యారం గ్రామానికి చెందిన రేపాకుల లాలయ్య (55), భార్య వీరమ్మతో కలిసి ఖమ్మంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. షుగర్‌తో బాధపడుతున్న లాలయ్య కాలి గాయాల చికిత్స కోసం కారేపల్లిలోని డాక్టర్ సామినేని రాఘవులు వద్దకు భార్యతో కలిసి వచ్చారు. ఈ క్రమంలో లాలయ్యను పరీక్షించిన వైద్యుడు రెండు ఇంజక్షన్లు ఇచ్చాడు. అనంతరం తల తిరుగుతూ నరాలు లాగుతున్నాయని చెబుతూనే లాలయ్య స్పృహ కోల్పోయే స్థితికి చేరాడు. దీంతో డాక్టర్ రాఘవులు మరో మూడు ఇంజక్షన్లు ఇవ్వగా నిమిషాల వ్యవధిలోనే లాలయ్య స్పృహ కోల్పోయి మృతి చెందాడని తెలిసింది. అయితే, వైద్యం వికటించడమే ఇందుకు కారణమని కుటుంబీకులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొనగా కారేపల్లి ఎస్‌ఐ ఎన్.రాజారాం చేరుకొని వైద్యుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

న్యాయం చేయాలని డిమాండ్

వైద్యుడి నిర్లక్ష్యంతోనే లాలయ్య మృతి చెందినందున నష్టపరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన కొనసాగగా, పెద్దమనుషులు కలగజేసుకుని ఇరువర్గాలతో చర్చించారు. ఈ నేపథ్యాన బాధిత కుటుంబానికి వైద్యుడు పరిహారం చెల్లించేందుకు అంగీకరించినట్లు తెలిసింది. దీంతో మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తరలించారు. కాగా, బాధిత కుటుంబాన్ని సీపీఎం నాయకులు భూక్యా వీరభద్రంనాయక్, కొండబోయిన నాగేశ్వరరావు తదితరులు పరామర్శించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని వసూళ్లు?

ఖమ్మంఅర్బన్: కలెక్టరేట్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బు వసూళ్లకు పాల్పడిన దంపతులపై ఫిర్యాదులు అందడంతో ఖమ్మం అర్బన్ పోలీసులు బుధవారం విచారించారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తికి చెందిన దంపతులు ఈ మోసానికి పాల్పడ్డారని తెలిసింది. దంపతుల్లో భార్య కలెక్టరేట్‌లోని ఓ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తుండగా తనకు రూ.20 వేలకు పైగా వేతనం వస్తోందని చెప్పుకుంది. ఇంకొందరి అవసరం ఉందని నమ్మించిన ఆ దంపతులు రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తి, గణేశ్వరం, రఘునాథపాలెం పరిసర గ్రామాలతో పాటు, ఖమ్మం ఖానాపురానికి చెందిన పలువురి వద్ద రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఆతర్వాత ఉద్యోగాలు రాకపోవడంతో ఖానాపురానికి చెందిన కొందరు ఖమ్మం అర్బన్ పోలీసులను ఆశ్రయించగా దంపతులను బుధవారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరగా మోసపోయినట్లు పలువురు తమను సంప్రదించడంతో ప్రాథమికంగా విచారించామని తెలిపారు. అయితే, రాతపూర్వకంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని వెల్లడించారు.

37 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ముదిగొండ: మండలంలోని చిరుమర్రిలో రెండు షెడ్లలో అక్రమంగా నిల్వ చేసిన 37 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. చిరుమర్రికి చెందిన రామారావు 19 క్వింటాళ్లు.. ఎల్లేశ్వరరావు 18 క్వింటాళ్లు నిల్వ చేయగా సీజ్ చేసి సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు ఉద్యమం


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

మధిర: మాదకద్రవ్యాల వాడకంతో ఎదురయ్యే అనర్థాలను వివరిస్తూ వాటి నిర్మూలనకు జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. మధిర మండలం దెందుకూరులో జరిగిన సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బుధవారం ఆయన వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా విద్యార్థులు, యువతను సమీకరించి గంజాయి, గుట్కా, ఇతర మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సులు, వ్యతిరేక ఉద్యమాలు నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఇదేసమయాన తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్ దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని కోరారు. కాగా, ప్రభుత్వం మాదకద్రవ్యాల నిర్మూలనపై కఠినంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక తెలంగాణ వాస్తవ చరిత్ర, సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ప్రజలకు తెలియజేసేలా కృషిచేస్తామని, అన్నివర్గాల ప్రజల సమస్యలపై సర్వే నిర్వహించి పరిష్కారానికి ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీ శ్రేణులు పోటీకి సిద్ధం కావాలని నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, విక్రమ్, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, యర్రా శ్రీకాంత్, చింతలచెర్వు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో పోలీసుల విచారణ

మృతురాలి పెద్దకొడుకుపై అనుమానాలు?

కారేపల్లి: మండలంలోని సామ్యతండా గ్రామంలో ఈ నెల 15వ తేదీ రాత్రి గుగులోతు సక్రి (65) హత్య జరగగా.. పోలీసులు విచారణలో వేగం పెంచారు. ఆమె మెడ, ముఖంపై తీవ్రగాయాలతో మృతి చెంది ఉండగా మంగళవారం గుర్తించారు. ఈ నేపథ్యాన మంగళవారం రాత్రి సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి పరిశీలించి డాగ్‌స్కాడ్‌తో అర్ధరాత్రి వరకు విచారణ చేపట్టారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉండగా.. ఆమె పెద్దకుమారుడి కదలికల ఆధారంగా అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అంతేకాక సక్రి పెద్ద కుమార్తె బుజ్జి సైతం ఆస్తి తగాదాల కారణంగానే తన తల్లిని హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ కోణంలో విచారణ చేస్తున్నారు. కాగా, సక్రి హత్య అనంతరం ఆమె భర్తకు వచ్చిన పింఛన్ రూ.50 వేలు, బంగారపు చెవిదిద్దులు, కాళ్ల పట్టీలు కానరాకపోవడంతో పోలీసులు ఆ దిశగా కూడా విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు బుధవారం ఖమ్మం ఆస్పత్రిలో సక్రి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా సామ్యతండాకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185351]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14404]

■ జెన్యూన్ కంపెనీలో వర్క్ చేయుటకు ఇంటర్/డిగ్రీ చేసిన స్త్రీ పురుషులు కావలెను. ఫీజులేదు. పార్ట్‌టైం 15 వేలు,ఫుల్‌టైం30 వేలు,రిటైర్డ్ ఎంప్లాయిస్, గృహిణులు, స్టూడెంట్స్ కావలెను. 8247014977 / 7799074463 [G-801083]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182
9010299957


అదనపు డాక్యుమెంట్లు సమర్పించండి: హైకోర్టు

కోకాపేట్‌లో బీఆర్‌ఎస్‌కు భూ కేటాయింపు రద్దు కోరుతూ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేట్‌లో బీఆర్‌ఎస్‌కు ప్రభుత్వం చేసిన భూమి కేటాయింపును రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌లో అదనపు డాక్యుమెంట్లు సమర్పించాలని హైకోర్టు పిటిషనర్లను ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కోసం బీఆర్‌ఎస్‌కు 2023లో ప్రభుత్వం 11 ఎకరాలను కేటాయించింది. దీని కోసం బీఆర్‌ఎస్ ఎకరాకు రూ.3.41 కోట్లు చెల్లించింది. అయితే కోకాపేట్‌లో బీఆర్‌ఎస్‌కు కేటాయించిన భూమి తమదేనంటూ సికింద్రాబాద్‌కు చెందిన అశోక్ దత్ జైశ్రీతోపాటు అతని కుటుంబసభ్యులు పిటిషన్ దాఖలు చేశారు. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్‌ఏ, హెచ్‌ఎండీఏ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, గండిపేట్ తహసీల్దార్‌తోపాటు బీఆర్‌ఎస్ పార్టీని ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున వి.మురళీమనోహర్ వాదనలు వినిపిస్తూ.. కోకాపేట్‌లోని ఆ భూమిని పిటిషనర్లు వారసత్వంగా పొందారన్నారు. వారి పూర్వీకులు కూడా ఆ భూమిని చట్టప్రకారం హక్కుదారుల వద్ద కొనుగోలు చేశారని చెప్పారు. బీఆర్‌ఎస్‌కు భూ కేటాయింపు చట్టవిరుద్ధమని.. ఆ గెజిట్‌ను రద్దు చేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. భూ హక్కులు, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అదనపు డాక్యుమెంట్లు సమర్పించాలని ఆదేశించారు.

శ్రీశైలం దిశగా కృష్ణమ్మ పరుగులు

- నారాయణపూర్ డ్యామ్ 9 గేట్లు ఎత్తి దిగువకు 37,260 క్యూసెక్కుల నీటి విడుదల
- నాలుగైదు రోజుల్లో శ్రీశైలానికి వరదనీరు చేరే అవకాశం
- ఆల్మట్టిలోకి నిలకడగా వరద ప్రవాహం
- తుంగభద్రలో పెరిగిన వరద


భద్రాచలం వద్ద జలకళ సంతరించుకున్న గోదావరి


తాలిపేరు ప్రాజెక్టు నుంచి భారీగా విడుదలవుతున్న వరదనీరు

సాక్షి, హైదరాబాద్: కృష్ణానది వరద ఉధృతికి కర్ణాటకలోని నారాయణపూర్ డ్యామ్‌లో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో ఆ రాష్ట్ర అధికారులు బుధవారం డ్యామ్ గేట్లు 9 ఎత్తి దిగువకు 37,260 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో కృష్ణమ్మ శ్రీశైలం వైపు పరుగులు తీస్తూ వస్తోంది. జూరాల ప్రాజెక్టులో నీటినిల్వ ఇప్పటికే 7.66 టీఎంసీలు ఉన్న నేపథ్యంలో..ఒక్క రోజులోనే ఆ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుంది. ఆ తర్వాత జూరాల గేట్లు ఎత్తి దిగువకు నీటికి విడుదల చేస్తారు. ఈ నేపథ్యంలో నాలుగైదు రోజుల్లో శ్రీశైలానికి ఎగువ నుంచి వరద చేరే అవకాశం ఉందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల కృష్ణా ప్రధానపాయ, ఉపనదుల్లో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టి డ్యామ్‌లోకి 92,836 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా.. నీటి నిల్వ గరిష్ట స్థాయికి చేరింది. దీంతో ఆ ప్రాజెక్టు గేట్లు ఎత్తి 65 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఆ జలాలు నారాయణపూర్ డ్యామ్‌లోకి చేరుతున్నాయి. కృష్ణా ప్రధానపాయలో వరద మరో నాలుగైదు రోజులు ఇదే రీతిలో కొనసాగే అవకాశముందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 49,522 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 39.72 మీటర్లకు చేరుకుంది.

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఏపీ 4.5 టీఎంసీలు.. తెలంగాణకు 5.414 టీఎంసీల నీటిని కేటాయిస్తూ మంగళవారం కృష్ణా బోర్డు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సాగర్‌లో నీటిమట్టం కనీస స్థాయికి దిగువన ఉన్న నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 5.705 టీఎంసీలను విడుదల చేయాలని ఆదేశించింది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ కుడి కేంద్రం ద్వారా ఏపీ 15,800, ఎడమ కేంద్రం ద్వారా తెలంగాణ 6,357 వెరసి 22,157 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తుండటంతో నీటినిల్వ 33.24 టీఎంసీలకు తగ్గింది. సాగర్‌లోకి 21,481 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 122.69 టీఎంసీలకు చేరుకుంది. తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువకు బుధవారం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

బుధవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు, నీటి నిల్వ ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1705	129.72	1699.67	102.53	92,736	65,000
నారాయణపూర్	1615	37.64	1611.75	33.21	51,250	37,260
ఉజ్జయిని	1630	117.64	1603.25	48.85	20,980	200
జూరాల	1045	9.66	1041.7	7.66	2,500	2,720
తుంగభద్ర	1633	105.79	1611.07	39.72	49,522	393
శ్రీశైలం	885	215.81	808.20	33.24	-	22,189
నాగార్జునసాగర్	590	312.05	504	122.69	21,481	6,398
పులిచింతల	175	45.77	99.41	0.72	154	50
ప్రకాశం బ్యారేజీ	57.05	57.05	3.07	3.07	8,193	8,193

వరద గోదావరి

భద్రాచలం వద్ద బుధవారం రాత్రి 21 అడుగులకు చేరే అవకాశం

భద్రాచలం అర్బన్: గోదావరి నిండుకుండను తలపిస్తోంది. భద్రాచలం వద్ద ఈ నెల 13వ తేదీ నుంచి 13 అడుగుల మేర నీటిమట్టం నిలకడగా ఉంది. రెండు,మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరద వచ్చి చేరుతుండడంతో మంగళవారం రాత్రి 14.5 అడుగులకు చేరింది. ఆపై అంతకంతకూ పెరుగుతూ బుధవారం సాయంత్రం 5 గంటలకల్లా 18.1 అడుగులకు చేరుకుంది. కాగా, బుధవారం రాత్రి మరో మూడు అడుగుల మేర పెరిగి 21 అడుగులకు చేరే అవకాశముందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు నదిలోకి దిగొద్దని హెచ్చరిస్తున్నారు.

'తాలిపేరు'కు పోటెత్తుతున్న వరద

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తుతోంది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిలాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో బుధవారం ఉదయం ప్రాజెక్టు 25 గేట్లలో 12 గేట్లు అడుగు మేర ఎత్తి 16,698 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అయినా వరద ఉధృతి ఆగలేదు. దీంతో మధ్యాహ్నం 3 గంటలకు 22 గేట్లు అడుగు మేర ఎత్తి ద్వారా 63 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రానికి వరద మరింతగా పెరగగా, 20 గేట్లను రెండేసి అడుగుల మేర, మిగతా ఐదు గేట్లను పూర్తిగా ఎత్తి 70,750 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు.



బిడ్డా.. లే!

అమ్మ ఎవరికైనా అమ్మే. వాహనం ఢీకొని కాళ్లు విరిగిన కోడెదూడ స్థితిని చూసి ఒక ఆవు తల్లడిల్లి పోయింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని కోడెదూడకు రెండు కాళ్లు విరిగాయి. లేవలేని స్థితిలో ఉన్న ఆ దూడ పరిస్థితిని గమనించిన తల్లి ఆవు కొమ్ములతో బిడ్డను లేపే ప్రయత్నం చేసింది. ఈ విషయాన్ని స్థానికులు మున్సిపల్ అధికారులకు తెలియజేయడంతో సిబ్బంది వచ్చి.. కోడె దూడను యజమానికి అప్పగించి రక్తం గడ్డ కట్టిన ప్రదేశాన్ని శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు.

- హుజూర్‌నగర్



గుండి వాగుతో గండం

కుమురంభీం జిల్లా కేంద్రం ఆసిఫా బాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న గుండివాసులకు ఏటా వాగు కష్టాలు తప్పడం లేదు. 2006లో ప్రారంభించిన వంతెన పనులు నిలిచిపోయాయి. కుమురంభీం ప్రాజెక్టు నుంచి బుధవారం నీటిని రెండు గేట్ల ద్వారా విడుదల చేయడంతో.. గుండి వాగులో వరద పెరిగింది. దీంతో జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోని గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులు దాదాపు 30 కిలోమీటర్లు తిరిగి ఆసిఫాబాద్‌కు చేరుకోవలసి వస్తోంది. కొందరు మాత్రం వాగు నీటిని ప్రమాదకరంగా దాటుతున్నారు. వరద మరింత పెరిగితే తెప్పలపై ప్రయాణించాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో వాగులో తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు.. తొలకరి వర్షాలకే కొట్టుకుపోవడం గమనార్హం.

-ఆసిఫాబాద్ రూరల్

నేడు శ్రీవారి అక్టోబర్ నెల ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన అక్టోబర్ నెల కోటాను గురువారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారిలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అలాగే వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఈ నెల 22న మధ్యాహ్నం మూడు గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదేవిధంగా ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో గదుల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు, తిరుమల–తిరుపతి శ్రీవారి సేవ కోటా ఈ నెల 27న ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం ఒంటి గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. కాగా, అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు సుప్రభాత సేవ మినహా, మిగిలిన అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు. అక్టోబర్ 11, 12వ తేదీల్లో సుప్రభాత సేవతో పాటు అన్ని ఆర్జిత సేవలు రద్దయ్యాయి. అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు అంగప్రదక్షిణ, వర్చువల్ సేవా దర్శనం టికెట్లను రద్దు చేశారు.

జిల్లా వార్తలు

ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు హాల్‌టికెట్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగ(ఎక్స్‌టర్నల్) నియామకాలకు ఈనెల 20, 21వ తేదీల్లో రాతపరీక్ష నిర్వహించనున్నారు. ఈనేపథ్యాన దరఖాస్తు సమయాన పొరపాట్లు దొర్లిన వారి సుమారు 4వేల మంది హాల్‌టికెట్లునిలిపివేయగా, బుధవారం వారికి కూడా హాల్‌టికెట్లు విడుదల చేశారు. ఈమేరకు అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రాలకు అర గంట ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రం చిరునామా, సమయంతో పాటు అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలను హాల్‌టికెట్లపై పొందుపర్చినట్లు వెల్లడించారు.

భారీ వర్షంతో నిలిచిన బొగ్గు ఉత్పత్తి


ఓసీ-4లో నిలిచిన వర్షపు నీరు

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయయ్యాయి. సింగరేణి పీకేఓసీ గనుల్లో 106 మి.మీ. మేర వర్షపాతం నమోదు కావడంతో గనుల్లో నీరు చేరి ఆరు వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అలాగే, 1.38 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత నిలిచిపోయింది. ఈ మేరకు గనుల్లో నిలిచిన నీటిని మోటార్ల సాయంతో బయటకు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరోపక్క మణుగూరు వినాయకనగర్‌లోకి భారీగా నీరు చేరడంతో స్థానికులు అవస్థ పడ్డారు.

కొత్తగూడెం ఏరియాలో..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలో మంగళవారం రాత్రి నుండి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షం కారణంగా 8వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఏరియాలో రోజుకు 38 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉండగా, 30వేల టన్నుల ఉత్పత్తి మాత్రమే నమోదైంది.

పర్ణశాల ఆలయంపై పట్టింపు లేదా?


పర్ణశాల దేవాలయం

రామయ్య నడయాడిన నేల అభివృద్ధిపై చిన్నచూపు

- ఆదాయం సమకూరుతున్నా పట్టించుకోని యంత్రాంగం
- అరకొర వసతులతో అవస్థలు పడుతున్న భక్తులు
- కనీసం ఓ పూట గడిపేందుకు నీడ లేదనే ఆవేదన


కాటేజీల నిర్మాణం కోసం తీసిన గోతుల్లో చేరిన నీరు

దుమ్ముగూడెం: దక్షిణ ఆయోధ్యగా ప్రసిద్ధి గాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి అనుబంధ దేవాలయమైన దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల ఆలయ అభివృద్ధిపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఏటా హుండీ ద్వారా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుండటమే కాక దుకాణాల వేలం ద్వారా కూడా ఆదాయం వస్తోంది. అయినప్పటికీ భక్తులకు కనీస వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారు. భద్రాచలం ఆలయానికి వచ్చే భక్తులంతా పర్ణశాలలోనూ రామయ్యను దర్శించుకుని ఇక్కడి గోదావరి ప్రాంతంలో బోట్ షికారు చేసి ప్రకృతి అందాలను చూసి పరవశించిపోతారు. ఇంతటి ప్రాశస్త్యం, ప్రత్యేకతలు ఉన్న దేవాలయంపై పాలకులు, అధికారుల చిన్నచూపుతో అభివృద్ధి జరగక, సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేల మంది భక్తులు స్వామి వారి దర్శనం కోసం వస్తుండగా, శని, ఆదివారాల్లో ఈ సంఖ్య రెట్టింపవుతుంది. అయినప్పటికీ భక్తులు నిరాశగానే వెనుతిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నిలువ నీడ లేదు..

పర్ణశాల ఆలయానికి ఏటా వివిధ రూపాల్లో రూ.కోటికి పైగా ఆదాయం సమకూరుతోంది. అయినా వేలాదిగా వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వేసవిలో విడిది చేయాలనే భావనతో దూర ప్రాంతాల నుంచి భక్తులు పర్ణశాలకు వస్తున్నా ఇక్కడ కాటేజీలు లేవని తెలిసి నిరాశగా వెనుతిరుగుతున్నారు. పర్ణశాలలో కాటేజీలు నిర్మిస్తే ఆలయానికి ఆదాయం పెరగడంతో పాటు వ్యాపార పరంగానూ అభివృద్ధి చెందే అవకాశముంది.

నత్తనడకన 'ప్రసాద్' పనులు

భద్రాచలం ఆలయంతో పాటు పర్ణశాల ఆలయంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టిన 'ప్రసాద్' పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పర్ణశాల రామాలయానికి మరిన్ని హంగులు కల్పించి పర్యాటక కేంద్రంగా రూపుదిద్దాలనే ఉద్దేశంతో 'ప్రసాద్' పథకం అమలుకు సర్వే చేయించింది. ఇందులో భాగంగా అధికారులు రూ.16.63 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఇది జరిగి రెండేళ్లయినా ఏ పని మొదలేకాలేదు. ప్రస్తుతం కాటేజీల నిర్మాణం కోసం గోతులు తీసినా వర్షాకాలం రావడంతో నిలిపివేశారు. దీంతో ఆ గోతుల్లో వర్షపు నీరు నిలవగా.. మళ్లీ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

ఈఓ దృష్టి సారిస్తేనే..

భద్రాచలం దేవస్థానం ఈఓగా బాధ్యతలు చేపట్టిన ఎల్.రమాదేవి అతి తక్కువ కాలంలోనే ఆలయ అభివృద్ధిపై తనదైన ముద్ర వేశారు. అంతేకాక పలు సమస్యలనూ పరిష్కరించారు. అదే తరహాలో పర్ణశాల ఆలయంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. కనీసం ఓ పూట విడిది చేసేలా కాటేజీల నిర్మాణం, భక్తులు సేద తీరేవిధంగా పార్కుల నిర్మాణం చేపట్టాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

కాటేజీలు నిర్మించాలి..



పర్ణశాల రామయ్య దర్శనానికి దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు. రాత్రయితే స్వస్థలాలకు వెళ్లలేని వారు ఇక్కడ ఉండేందుకు సరైన సౌకర్యాలు లేవు. ఆలయ అధికారులు స్పందించి కాటేజీలు నిర్మించడంతోపాటు ఇతర వసతులు కల్పించాలి.

-ఎం.గని, నల్లగొండ జిల్లా

అరకొర సౌకర్యాలు..



పర్ణశాలలో అరకొర వసతులే ఉన్నాయి. స్వామి దర్శనం అనంతరం కాసేపు విశ్రాంతి తీసుకుందామంటే నిలువ నీడ లేదు. ఏటా మేం స్వామి దర్శనానికి వస్తున్నాం. కానీ, నేటి వరకు భక్తులకు ఉపయోగపడే సౌకర్యాలు కానరాలేదు.

-దేవ సుధాకర్, కృష్ణా జిల్లా

త్వరలో రీజియన్‌కు 25 కొత్తబస్సులు

- రోజువారీ 2.40 లక్షల మంది ప్రయాణం
- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సరిరామ్

సత్తుపల్లిటౌన్: ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోలకు త్వరలో 25 కొత్త బస్సులు రానున్నాయని, పాడైపోయిన బస్సుల స్థానంలోనూ కొత్తవి కేటాయించనున్నట్లు రీజినల్ మేనేజర్ అజ్మీరా సరిరామ్ వెల్లడించారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు బుధవారం వచ్చిన ఆయన రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం 'లక్ష్యే లక్ష్యం' కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే, శ్రీరామ నవమికి ముత్యాల తలంబ్రాలు అత్యధికంగా బుకింగ్ చేసిన సత్తుపల్లి వీబీఓ కిన్నెర ఆనంద్, ఎస్.సునీతను సత్కరించారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ రీజియన్‌లో ప్రతిరోజు 2.42 లక్షల కి.మీ. తిరుగుతున్న బస్సుల ద్వారా ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్లు తెలిపారు.


పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్ఎం సరిరామ్

ప్రస్తుతం 100 మంది వరకు డ్రైవర్ల కొరత ఉన్నా సామర్థ్యానికి మించి బస్సులను తిప్పుతున్నామని చెప్పారు. తల్లాడ, అశ్వారావుపేట, వీ.ఎం.బంజరు, మండలపల్లి బస్టాండ్లలో మరమ్మతు, సత్తుపల్లి బస్టాండ్‌లో అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. కాగా, ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు ప్రయాణికులు సహకరించాలని కోరారు. ఇక ఉద్యోగులు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు ఇతర బస్సుల్లోనూ ప్రయాణికులు ఎక్కేలా కృషి చేస్తూ డిపోకు రూ.లక్ష ఆదాయం అదనంగా ఆర్జించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ సాహితీ, కార్గో ఇన్‌ఛార్జ్ మున్నీర్‌పాషా, ఏడీసీలు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి


- కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు దశల వారీ పోరాటాలు
- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు, కోతలు లేకుండా రూ.2 లక్షల మేర రైతు రుణమాఫీ చేయాల్సిందేనని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. కానీ ఇప్పుడు తెల్లరేషన్ కార్డు, ఇతర అంశాలను ప్రామాణికంగా ప్రకటించడం రైతులను ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొన్నారు. జేఎల్‌జీ సంఘాల రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని, లేకుంటే కౌలు రైతులు నష్టపోతారని చెప్పారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా హామీల అమలులో తాత్సారం చేస్తున్నారని రంగారావు విమర్శించారు. కొత్త రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం, వ్యవసాయ కార్మికులకు ఏటా రూ.12 వేల పంపిణీ, ధరణి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని తెలిపారు. ఈ మేరకు 22న రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, 29న కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేపట్టడంతో పాటు ఆగస్టు 21న చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు రంగారావు వెల్లడించారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అన్ని పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కెచ్చల రంగయ్య, చిన్న చంద్రన్న, గుమ్మడి నర్సయ్య, వి.ప్రభాకర్, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, ముద్ద భిక్షం, ఎం.కృష్ణ, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రంగుమారిన 'కిన్నెరసాని'!


ఐదు రోజుల క్రితం నీలం రంగులో...


రంగు మారడంతో ఇప్పుడు ఇలా...

శుద్ధి చేసినట్లు స్వచ్ఛంగా కనిపించే కిన్నెరసాని జలాశయంలోని నీరు రంగు మారింది. పాల్వంచ మండలం కిన్నెరసాని రిజర్వాయర్‌లో ఐదు రోజుల కిందటి వరకు నీరు నీలం రంగులో కనిపించింది. అయితే, ఇటీవల వర్షాలతో ఎగువ నుంచి వరద వచ్చి చేరుతుండటంతో ఆ నీరు కాస్తా కలుషితమై బురద రంగులోకి మారింది. కాగా, 407 అడుగుల మేర నిల్వ సామర్థ్యం కలిగిన ఈ జలాశయం నుంచి కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు వివిధ కర్మాగారాలకు నీరు సరఫరా అవుతోంది. అయితే, రంగు మారిన నీరు వస్తుండటంతో శుద్ధి చేసుకుని తాగాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు. ఇక ఎగువన కురుస్తున్న వర్షాలతో కిన్నెరసానికి వరద ఉధృతి కొనసాగుతుండగా నీటిమట్టం బుధవారం ఉదయానికి 402.90 అడుగులకు చేరింది. దీంతో మూడు గేట్లు ఎత్తి 12 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

– పాల్వంచరూరల్